ప్రజాశక్తి
మంగళవారం 18 ఏప్రిల్ 2023
5
కర్నూలు

సైబర్ మాయ...

- జిల్లాలో తరచూ సైబర్ నేరాలు - మోసపోతున్న సామాన్యులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సామాన్యులు సైబర్ వలలో పడుతున్నారు. మాయమాటలతో మోసపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో తరచూ సైబర్ నేరాలు ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి...

జిల్లాలో తరచూ సైబర్ నేరాలు జరుగుతున్నాయి. అమాయకత్వం, అత్యాశతో ప్రజలు నేరగాళ్లకు చిక్కి మోసపోతున్నారు. కర్నూలులో ఓ యువకుడి విదేశీ ఉద్యోగం నేపథ్యంతో ఏకంగా రూ.20 లక్షలు మోసపోయాడు. ఇటీవల కొందరు ప్రముఖ సంస్థల వస్తువుల వార్షికోత్సవం సందర్భంగా తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు రైతుల పేరుతో సామాజిక మధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చి మోసగిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాలోని పలువురు పోలీసు అధికారుల పేరుతో ఖాతాలు తెరిచి వారు సన్నిహితులను డబ్బులు ఆ ఖాతాల్లో వేయించుకునే ప్రయత్నం చేశారు. కరోనా సమయంలో బీమా సొమ్ము పేరుతోనే మోసాలకు పాల్పడ్డారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వ్యక్తులు నమ్మి పంపిన చిత్రాలు, వీడియోలతో బ్లాక్ మెయిల్‌కు గురైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కొంతకాలంగా పెట్టుబడుల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రూ.లక్ష పెట్టుబడిగా పెడితే నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు పొందవచ్చని, ఏడాదికి రెట్టింపు ఆదాయం అంటూ సైబర్ నేరగాళ్లు పలు నకిలీ వెబ్‌సైట్ల ప్రకటనలతో అమాయకులను ఆకర్షిస్తున్నారు. పెళ్లి సంబంధం వెబ్‌సైట్‌తో మోసపోయిన బాధితులూ ఉన్నారు. అంతర్జాలాన్ని ఆసరాగా చేసుకునే సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త విధానాలతో అమాయకుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. సుదూర రాష్ట్రాల నుంచి నేరాలకు పాల్పడుతుండడం నిందితులను పట్టుకొని సొమ్ము రికవరీ చేయడం పోలీసులకు సవాలుగా మారింది. 2021లో 44 నేరాలు జరగగా, 2022 సంవత్సరంలో 58 నేరాలు జరిగాయి. గతం ఏడాది కన్నా 14 కేసులు పెరిగాయి.

గతంలో పలు ఘటనలు

నైజీరియాకు చెందిన సైబర్ నేరగాళ్ల ఎమ్మిగనూరుకు చెందిన ఒక వ్యక్తిని పరిచయం చేసుకున్నారు. యుకెలో నూనె వ్యాపారం చేస్తున్నట్లు నమ్మించారు. ముంబయిలో ముడిసరుకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. తమది విదేశీ సంస్థ అయినందుకు ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నామని, భాగ్యస్వామిగా చేరితే తక్కువ చెల్లించవచ్చని చెప్పారు. దీంతో ఆయన ఏకంగా రూ.11.30 లక్షలు వారి ఖాతాలో డిపాజిట్ చేసి మోసపోయారు.

దేశ రక్షణకు...

మరో స్వాతంత్ర్య పోరాటం

- ప్రచార భేరిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారతదేశ రాజ్యాంగ పరిరక్షణకు, సోదర తత్వాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి గతంలో బ్రిటీష్ వారిని తరిమి వేయడానికి ఏ రకంగా ప్రజలందరూ కలిసి పోరాడారో ఆ విధంగా ప్రజలందరూ తిరిగి మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మోడీ నాయకత్వాన ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపి భారత దేశాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈనెల 14 నుండి 30 వరకు 'బిజెపికి హటావో దేశ్‌కి బచావో' అనే నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార భేరి సోమవారం సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు మొహమ్మద్ షరీఫ్ అధ్యక్షతన కర్నూలు నగరంలోని 1వ వార్డు, 50, 51, 11వ వార్డులు దాబారా, వడ్డగేరి తదిత ప్రాంతాల్లో సాగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్, మహేష్ వివిధ ప్రాంతాల్లో, కూడళ్లలో నాయకులు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను, పెంచడం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, ధరలు పెంచిందన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మి వేయడం, ప్రైవేటీకరించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే, విమానాలను, రైల్వేలను, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని ప్రయివేటీకరించి ఆదానీ అంబానీలకు బిజెపి ప్రభుత్వం ఉడిగం చేస్తుందని విమర్శించారు. ఇది అన్యాయం, దుర్మార్గం అని నిలదీసిన వ్యక్తులను, సంస్థలను జైలు పాలు చేస్తుందన్నారు. బెయిల్ రాకుండా న్యాయస్థానాలను మేమేజ్ చేస్తుందని , అడ్డుపడుతుందని బిజెపి ప్రభుత్వం పై వారు నిప్పులు చెరిగారు. ఎవరైతే ప్రశ్నిస్తారో వారిని దేశద్రోహులని, చైనా భక్తులని, కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం, మతం పేరుతో, హిందూ ముస్లింల మధ్య హిందువులకు క్రైస్తవుల మధ్య తగాదాలు పెట్టి, కారు చిచ్చుపెట్టి తన రాజకీయ స్వార్థ ప్రయోజనాలను కాపాడుకుంటుందని ఆవేదన చెందారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నగర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రచార భేరిలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజల విశ్వాసం కోల్పోయిన మోడీ ప్రభుత్వం

- నగరంలో సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో నాయకులు

బడా పెట్టుబడి దారుల కొమ్ముకాస్తున్న నరేంద్రమోడీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నరేంద్రమోడీని గద్దెదింపుదాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం నినాదంలో చేసిన ప్రచార భేరి సోమవారం కర్నూలు నగరంలోని చెక్‌పోస్టు నుండి ప్రారంభమై సోమిశెట్టి నగర్, గణేష్ నగర్, ఫోర్త్ క్లాస్ కాలనీ, ఈశ్వర్ రెడ్డి నగర్ నందూరి ప్రసాదరావు నగర్, మాకినేని బసవ పున్నయ్యనగర్, సి క్యాంప్ సెంటర్ వరకు పాదయాత్ర కొనసాగింది. కాలనీల ప్రజల నుండి ప్రచారభేరి చైతన్య పాదయాత్రకు విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి సిపిఎం వార్డు శాఖ కార్యదర్శి బి.రాధాకృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్నాథం , సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు లు పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం భారతదేశ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. దేశ ప్రజలు కష్టపడి నిర్మించుకున్న భారత దేశ సంపద విశాఖఉక్కు, బిఎస్ఎన్ఎల్, రైల్వే, విమానయాన, సముద్ర తీరపోర్టులను,పెట్రోలు, డీజిల్ గ్యాస్ సంస్థలు దేశ ప్రజల సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే అధికారం బిజెపి ప్రభుత్వానికి లేదన్నారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నరేంద్ర మోడీ జేబుసంస్థగా మారిందన్నారు. కేంద్రం ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు , జిఎస్‌టి వాటా నిధులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రజల అభివృద్ధికి నిరోధకంగా బిజెపి చేస్తున్నదన్నారు. సిపిఎం , సిపిఐ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు , ప్రజలు పాల్గొన్నారు.

చెక్ పోస్ట్ నుంచి సిక్యాంపు పార్కు జరిగిన పాదయాత్రలో పాల్గొని మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

పరిష్కరించాలి లేదా

సంజాయిషీ ఇవ్వాలి

- రీఓపన్ అయితే షోకాజ్ నోటీసులు జారీ
- కలెక్టర్ జి.సృజన హెచ్చరిక

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

స్పందన సమస్యలకు సరైన పరిష్కారం లేకపోతే సంజాయిసి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అధికారులను ఆదేశించారు. స్పందనకు వస్తున్న సమస్య లు రిఓపెన్ అయితే సోకాజ్ నోటీసులు జారీ చేస్తానని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వారం కూడా సచివాలయం, మండల స్థాయిలో పరిష్కరించాల్సిన చిన్న చిన్న సమస్యలు ఇక్కడికి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. అందులో కూడా రెవిన్యూ సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. తహశీల్దార్లు స్పందించక పోవడం వల్ల ఇక్కడి దాకా వస్తున్నారా అని ప్రశ్నించారు. సబ్ డివిజన్ ,మ్యుటేషన్ సమస్యల పరిష్కారానికి సచివాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలన్న విషయం ప్రజలకు ఎందుకు తెలియదు అని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై న సచివాలయం ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్, జడ్పి సిఇఒ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ శిక్షణ ఇచ్చిన రెండు వారాల తర్వాత దరఖాస్తులు ఇక్కడికి వచ్చాయంటే మండల టీమ్, సచివాలయం ఉద్యోగులదే బాధ్యత అని, ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. గత వారం లో రెవెన్యూ కు సంబంధించి 566, భూ ఆక్రమణ కు సంబంధించి 20018 సెక్రటేరియట్ ఎంప్లాయిస్ సంబంధించి 575 ఫిర్యాదులు, పోలీస్ శాఖకు సంబంధించి 92 రీ ఓపెన్ అయ్యాయన్నారు. ఇంకా వ్యవసాయ శాఖ, హౌసింగ్ తదితర శాఖల్లో కూడా రీ ఓపెన్ అయ్యాయన్నారు.. మండల స్థాయి అధికారులు మండల స్పెషల్ ఆఫీసర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతినిధిగా చూడాలని కలెక్టర్ సూచించారు. తమ శాఖకు సంబంధించిన అధికారి కాదని ఉపేక్షించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, రమ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

దేవనకొండ మండలంలో యువగళం

- రైతులతో లోకేష్ ముఖాముఖి - సమస్యలు విన్నవించిన పలువురు

ప్రజాశక్తి- దేవనకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలంలో సాగింది. ఎంకె.కొట్టాల నుంచి గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బుర్రకుంట, వెంకటాపురం గ్రామాల మీదుగా సాగింది. ఆయా గ్రామాల్లో నారా లోకేష్ యువగళం పాదయాత్రకు జనం నీరాజనం పట్టారు. టిడిపి నాయకులు నీలకంఠం, రాందాస్ గౌడ్ ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో గజమాలను లోకేష్, కోట్ల సుజాతమ్మకు వేశారు. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా పి.కోటకొండ వరకు పిల్ల కాలువల నిర్మాణాలను చేపట్టి సాగు నీరు ఇవ్వాలని రమణారెడ్డి ఆధ్వర్యంలో గుడిమిరాళ్ల గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. సబ్సిడీ ద్వారా గొర్రెల పెంపకందారులకు గొర్రెల యూనిట్లు, మందులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన నారా లోకేష్ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేస్తామన్నారు. బుర్రకుంట సమీపంలో ఆలూరు నియోజకవర్గం పరిధిలోని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వివిధ మండలాల రైతులు రైతాంగ సమస్యలను విన్నవించారు. ఆస్పరి, దేవనకొండ ప్రాంతాల రైతులు అధిక విస్తీర్ణంలో టమోటా పంటను సాగు చేస్తారని, జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని విన్నవించారు. అందుకు స్పందించిన ఆయన... జ్యూస్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి తమ వంతు కృషి చేస్తామని హామీఇచ్చారు. తెర్నేకల్ గ్రామ రైతు ఆంజనేయులు మాట్లాడుతూ... ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీలకు చెల్లిస్తున్న వేతనాల్లో కోత విధించారని, హంద్రీనీవా పంట కాలువలు అసంపూర్తిగా ఉన్నాయని, తక్షణమే వాటిని పూర్తి చేయించాలని కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారన్నారు. పొట్లపాడు రైతు లక్ష్మన్న మాట్లాడుతూ... గత రెండేళ్లుగా ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాకు పరిశ్రమలు పెట్టడానికి పెద్ద ఎత్తున వ్యాపార వర్గాల నుంచి పెట్టుబడులు తెప్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఉపాధి హామీ ద్వారా వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేసి పండ్ల తోటల పెంపకాన్ని రైతులతో చేపట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోనా, హంద్రీనీవా, ఎల్ఎల్‌సి, ఆర్‌డిఎస్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులను ఆదుకుంటామని హామీఇచ్చారు. టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, టిడిపి ఆలూరు, మంత్రాలయం, ఆత్మకూరు ఇన్‌ఛార్జీలు కోట్ల సుజాతమ్మ, తిక్కా రెడ్డి, ఏరాసు ప్రతాపరెడ్డి, టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీలు వీరభద్ర గౌడ్, వైకుంఠ మల్లికార్జున చౌదరి, పారిశ్రామికవేత్త, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ ఆయన భార్య జ్యోతి, మసాలా పద్మజ, ఆస్పరి మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, నాయకులు బడిగింజల రంగన్న, రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, వెంకట స్వామి గౌడ్, రాజశేఖర్ గౌడ్, బండ్లయ్య, మాలిక్ బాషా, రాజా సాబ్, సర్పంచులు శేషి రెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

లోకేష్‌కు గజమాల వేస్తున్న నాయకులు

టిడిపి బిసిలకు ఏం చేసింది ?

నారా లోకేష్‌కు లోకపరిజ్ఞానం శూన్యం

ఎంపి సంజీవ్‌కుమార్, మేయర్ బివై.రామయ్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బిసిల కోసం ఏం చేసిందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు నగర మేయర్ బివై. రామయ్య, కర్నూలు ఎంపి డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం పత్తికొండ నియోజకవర్గంలో యువగళం యాత్రలో భాగంగా నిర్వహించిన బిసిల సమావేశంలో బిసిలకు వైసిపి అన్యాయం చేసిందనే నారా లోకేష్ వ్యాఖ్యలను వారు ఖండించారు. 2014 ఎన్నికల్లో బిసిలకు ఏటా రూ.10 వేల కోట్లు కేటాయిస్తామని టిడిపి హామీచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక ఐదేళ్ళలో రూ.14,246 వేల కోట్లతో సరిపెట్టారని మండిపడ్డారు. బిసి సంఘాల నాయకులను అరెస్టులు, బెదిరింపులు, కేసులతో అవమానిస్తే, బీసీలంతా వైయస్ జగన్ ను నమ్మారన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వార్డు మెంబర్ నుంచి రాజ్యసభ సభ్యుడి దాక మొత్తం 82,432 వేల పదవులు కేటాయించారని అన్నారు. వివిధ సంక్షేమ పథకాలతో రూ.1,63,344 కోట్లు బిసిల అభ్యున్నతికి ఖర్చు చేసి వారిని వైసిపి ఆదరించిందన్నారు. ఈ విషయాలు తెలుసుకునే లోక పరిజ్ఞానం లేకనే లోకేష్ ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ పోతున్నాడు తప్ప అందులో నిజానిజాలు తెలుసుకోలేకపోతున్నాడని అన్నారు. టిడిపి ఐదేళ్ళ పాలనలో బిసిలపై చూపిన చిన్నచూపు కారణంగానే గత సార్వత్రిక ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించారని అన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి భావిస్తే, టిడిపి నేత బిర్రు ప్రతాపరెడ్డి ద్వారా హైకోర్టులో కేసు వేయించి బిసిలకు చంద్రబాబు తీరని అన్యాయం చేశారన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వైసిపి జోనల్ ఇంచార్జ్ రియల్ టైం నాగరాజు, నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్, నాయకులు బంగారు రాజశేఖర్ పాల్గొన్నారు.

నీరజ రెడ్డి మృతికి కాంగ్రెస్ సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టర్ : ఆలూరు మాజీ ఎమ్మెల్యే నీరజ రెడ్డి అకాల మృతికి డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు సోమవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చేసిన సేవలను వారు గుర్తుచేసుకొని కొనియాడారు.

'అశోకా'లో ఈ క్యూబ్ కార్నివాల్-2023 ప్రారంభం

ఎడ్యుకేషన్-ఎంటర్‌టైన్‌మెంట్ -ఎంపవర్మెంట్ లతో సందడి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం దూపాడులోని 'అశోకా' ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ లో ప్రతి యేడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ క్యూబ్ ఉమెన్స్ కార్నివాల్ 2023ను ఎపి స్టేట్ ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ శారదా కసిరెడ్డి ప్రారంభించారు. సోమవారం ఆమె కళాశాల ప్రాంగణంలో బెలూన్స్‌ను గాలిలోకి వదిలి ప్రారంభించారు. అనంతరం శారద కసిరెడ్డి మాట్లాడుతూ 'అశోకా' విద్యారినిలు గత యేడాది 2022లో '523' ప్లేస్మెంట్స్, ఈ యేడాది ఇప్పటివరకు సుమారు '627'కి పైగా ప్లేస్మెంట్స్ సాధించినందుకు అభినందించారు, వారు సాధించిన '627' ప్లేస్మెంట్స్ కర్నూలు జిల్లాకే గర్వకారణమని, మహిళా సాధికారత పట్ల 'అశోకా' కాలేజ్ మేనేజ్‌మెంట్ వారి కృషికి నిదర్శనమన్నారు. వారం రోజులపాటు జరిగే ఈ కల్చరల్ మరియు స్పోర్ట్స్ కార్నివాల్ ప్రారంభోత్సవం నందు విద్యార్థినిలు అందర్శు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా ఈటింగ్ కాంపిటీషన్, సింగింగ్, డ్యాన్సింగ్, మిస్‌అశోకా, స్లోస్కూటీ రేస్ వంటి ప్రోగ్రామ్స్ నిర్వహించారు. 'అశోకా' కాలేజ్ డైరెక్టర్ హరీస్‌కృష్ణా, వివిధ విభాగాల అధిపతులు, టీచింగ్ , నాన్ టీచింగ్ స్టాఫ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శారదా కసిరెడ్డి

పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు మండలం గొందిపర్ల, పసుపల గ్రామాల్లోని పేదల గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు మండలం గొందిపర్ల, పసుపల గ్రామాల పేదలకు పట్టాలు ఇవ్వాలని మండల నాయకులు పిబి ఉసెనయ్య అధ్యక్షతన ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ ధర్నాలో కెవి. నారాయణ మాట్లాడుతూ కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో పేపర్ మిల్లులో చిప్పర్ హౌస్ సెక్షన్ లో పనిచేసే కార్మికులు 80 మందికి పైగా ఉన్నారన్నారు. వీరందరూ గొందిపర్ల గ్రామం దగ్గరలో సర్వే నంబర్ 106లో గుడిసెలు వేసుకొని నివసిస్తూ కంపెనీలో పనిచేసేవారన్నారు. దాదాపు 40 ఏళ్లుగా అక్కడే ఉంటున్నారన్నారు. పది సంవత్సరాలు క్రితం పేపర్ మిల్లు మూతబడిందని,చిపర్ హౌస్‌లో పనిచేసే కార్మికులు వ్యవసాయ ఇతర పనులు చేసుకుంటూ అక్కడే ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పేపర్ మిల్లు ఏర్పాటు చేసే సందర్భంగా 169 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఇచ్చారన్నారు. ఈరోజు కంపెనీ యాజమాన్యం కంపెనీ మొత్తం కూల్చివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూ మిని అమ్ముతున్నారన్నారు. అక్కడే నివాసం ఉన్నా చిప్పర హౌస్ కార్మికులను ఖాళీ చేయాలంటూ భయ భ్రాంతులకు గురిచేసి, మిల్లు మూసేసి కార్మికులకు ఉపాధి లేకుండా చేసి గుడిసె వేసు కుంటే వాటిని కూడా కూల్చడం దుర్మార్గమని అ న్నారు. పసుపుల గ్రామంలో 200 మంది పేదలు చుక్కల భూములు 70 సర్వే నెంబర్ లో గుడిసెలు వేసుకుంటే అదే గ్రామానికి చెందిన మురళీకృష్ణ, గుండాలను పెట్టి దాడి చేయించి గుడిసెలు కూల్చేశారన్నారు. మాకు స్టే ఉంది అంటూ చుక్కల భూమిపై స్టే తీసుకొని వచ్చారన్నారు. కానీ అక్కడ ఏ పనులు జరగకూడదు సమగ్రంగా విచారణ చేయాలని ఎస్‌సి కమిషన్ చైర్మన్ పరిశీలించి పేదలకు న్యాయం చేయాలని రెవెన్యూ వారికి నాటి కలెక్టర్‌కు తెలియజేసినా నేటికీ స్పందన లేదన్నారు. ఈ రెండు గ్రామాల్లో రెవెన్యూ వాళ్ళ పరిశీలన చేసి తక్షణం పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ సి.హరి ప్రసాద్ ధర్నా దగ్గరకు వచ్చి మాట్లాడుతూ వారం సమయం ఇస్తే నేను ఆ భూమిని సర్వే చేయించి పేదలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ధర్నాను విరమించారు. కర్నూలు మండల నాయకులు డి రాఘవేంద్ర, ఈ తాండ్రపాడు సర్పంచి ఎస్.బాలపీరా, గొందిపర్ల మాజీ సర్పంచి జి ఆంజనేయులు, బి శ్రీరాములు, ఎం.బీసన్న, ఎం.నరసింహులు, పసుపల జగదీష్, మునిస్వామి, దాదాపీరా, శ్రీనివాసరెడ్డి, గొందిపర్ల, పసుపల గ్రామాల పేదలు మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ముఖ్యమంత్రి అమరావతిలో ఇచ్చిన ఇఫ్తార్ విందుకు హాజరయిన హఫీజ్‌ఖాన్

ప్రభుత్వ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డితో కలిసి కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. సోమవారం విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ముస్లింల సంక్షేమం కోసం పెద్దపీట వేశారన్నారు. మరోసారి రాష్ట్ర ప్రజానీకం జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు , రాష్ట్ర మంత్రులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వై.ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

కుర్నూలు నాల్గవ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా యామసాని ప్రకాశ్ రెడ్డి నియమితులయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం ఆయన కర్నూలు జిల్లా నాల్గవ అదనపు జిల్లా కోర్టు (ఫ్యామిలీ కోర్టు)లో బాధ్యతలు స్వీకరించారు. ప్రాసిక్యూషన్ తరుపున తన వాదనలు వినిపించనున్నారు. ఆయన 1995 వసంవత్సరం కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా నమోదుచేసుకొని తన వృత్తిని కొనసాగిస్తున్నారు. సీనియర్ న్యాయవాది ఎ.రామసుబ్బారెడ్డి దగ్గర కొంతకాలం జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు. వై.ప్రకాశ్ రెడ్డి నియామకం పట్ల సీనియర్ న్యాయవాదులు ఎ.రామసుబ్బారెడ్డి, వై.శ్రీనివాసులు, ఎంఎల్.శ్రీనివాస రెడ్డి,పి.సువర్ణ రెడ్డి,కర్నూల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు, టి.నాగభూషణ నాయుడు, ఎంవి. చక్రపాణి హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం కలిగించేలా పనిచేయాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం కలిగించేలా అధికారులు పని చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులకు సూచించారు. స్పందనలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పూర్తి కావాల్సిన సమస్యలతో డివిజన్ స్థాయి వరకు వస్తున్నారని, నాణ్యతతో గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. గ్రామంలో ఆర్‌డిటి సంస్థ ఇల్లు లేని వారికి నిర్మాణం చేసి ఇస్తున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన ఇంటి పట్టాలను తీసుకొని నూతన పట్టాలను మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం జరుగుతుందని ఆదోని మండలం చిన్నహరివాణం ఎస్సీ కాలనీకి చెందిన వారు అర్జీ సమర్పించారు. కోసిగి మండలం నేలకోసిగి గ్రామానికి చెందిన నరసింహులు సంబంధించి సర్వే నెంబర్ 123పైకి 2.60 ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్ నమోదు చేసేందుకు అర్జీ అందజేశారు. పరిపాలన అధికారి గోవిందు సింగ్, డిఎల్‌పిఒ నూర్జహాన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియ, మున్సిపల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఓ ప్రజాప్రతినిధి కారణంగా 70 రోజులు తాగునీరు బంద్

- రెండు నెలలు కావస్తున్నా సమస్యను పరిష్కరించని అధికారులు

- స్పందనలో ఫిర్యాదు చేసిన దేశాయి మాధవరావు

ప్రజాశక్తి - నందవరం

స్పందనలో వినతిపత్రం అందజేస్తున్న మాధవ రావు

నందవరంలో చేత కాని పరిపాలన కొన సాగుతోందని, ఓ ప్రజాప్రతినిధి వల్ల 70 రోజులుగా తాగునీరు బంద్ అయిందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి మాధవరావు దేశాయి విమర్శించారు. నందవరంలోని కోటా వీధిలో రెండు నెలలు కావస్తున్నా తాగునీటి సమస్య పరిష్కరించడం లేదని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో కోటా వీధి ప్రజలతో కలిసి స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో తాగునీటి సమస్యను రాకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఓ వైపు చెబుతున్నారని తెలిపారు. నందవరంలో మాత్రం ఉన్న కుళాయిలను తొలగించి, తాగునీటి సరఫరాను బంద్ చేశారని చెప్పారు. నందవరం కోటా వీధిలో ఉన్న 7 కుళాయిలను బంద్ చేసి 70 రోజులు కావస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి కోసం కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, ఒక ట్యాంకు నుంచి కనెక్షన్ ఇవ్వడానికి 70 రోజులు పడుతుందా అని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, ఎఇ, డిపిఒకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వారం రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే కలెక్టరేట్‌లో స్పందనలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కోటా వీధి ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - కౌతాళం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ, నాయకులు

కౌతాళం పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ప్రారంభించారు. సోమవారం సర్పంచి పాల్ దినకరన్, పంచాయతీ అధికారులు ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో చాలా గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారని తెలిపారు. వేసవి కావడంతో వారి దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి మాట్లాడుతూ... ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో ప్రజలకు ఎన్నో సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉప సర్పంచి తిక్కయ్య, కార్యదర్శి నాగరాజు, పంచాయతీ

బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం...

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో యాత్రనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. సోమవారం నాలుగో రోజు పట్టణంలోని బోయగేరి, నిజాముద్దీన్ కాలనీ, గణేష్ సర్కిల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తీ గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. అదాని, అంబాని లాంటి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు లక్ష్మన్న, సుదర్శన్, నాయకులు యంకప్ప, రాజు, నాగరాజు, తిప్పన్న, ఒబి.నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : 2014 ఎన్నికల్లో బిజెపిని గెలిపిస్తే విదేశాల్లో దాచిన నల్లధనాన్ని దేశానికి తీసుకొచ్చి ప్రతి కుటుంబ ఖాతాలోకి రూ.15 లక్షలు వేస్తామని హామీ ఇచ్చారని, మోసపూరిత హామీలిచ్చి గద్దెక్కిన బిజెపిని గద్దె దింపాలని సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. సోమవారం నాలుగో రోజు పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలోని ఎల్లమ్మ గుడి వీధిలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న, సిపిఎం నాయకులు రాముడు మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన పన్నుల భారాలను మోపుతూ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. జిఎస్‌టి పేరుతో ప్రజలపై భారాలు వేస్తూ ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారని తెలిపారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, మల్లికార్జున గౌడ్, నరసింహులు, ఖాజా, దాదావలీ, సుంకన్న, రమేష్, అంజి, మాణిక్యం, సిపిఎం నాయకులు అబ్దుల్లా, కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ప్రచార యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

విద్యార్థినులతో మాట్లాడుతున్న సునీత

కస్తూర్బా పాఠశాల తనిఖీ

- పాఠశాల, నీటి వసతులపై జిసిడిఒ సునీత ఆరా

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సమగ్ర శిక్ష గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సునీత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో పాఠశాలలోని నీటి సమస్య నీటి వనరులపై ఆరా తీశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్ నుంచే తాగునీటిని తాగుతున్నామని, ఇతర అవసరాలకు ప్రత్యామ్నాయ నీటిని వినియోగించుకుంటున్నామని బాలికలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కస్తూరిబా పాఠశాలలో ఇంటర్ విద్యలో ఎంపిసి మొదటి సంవత్సరంలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాఠశాల ఎస్ఒ విద్యావతి, సిఆర్‌పి పుల్లన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపండి

- ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగిలోని రైల్వే గేట్ తరచుగా వేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం కోసిగి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు రాముడు, గోపాల్, వీరేష్, సామ్యేల్ మాట్లాడారు. కోసిగి మండలానికి సంబంధించిన 26 గ్రామాలు, కౌతాళం మండలానికి సంబంధించిన 8 గ్రామాల ప్రజలు ఈ రైల్వే గేట్ మీద వెళ్లాల్సి ఉందని తెలిపారు. ఉరుకుంద నరసింహస్వామి దేవాలయానికి వెళ్లే భక్తులు, ఖాదర్ లింగ దర్గాకు వెళ్లే భక్తులు కూడా ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉందన్నారు. శ్రావణ మాసంలో నెలరోజుల పాటు ఉరుకుంద నరసింహస్వామి వారోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ వారోత్సవాలకు ఈ ప్రాంత ప్రజలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ మార్గంలోనే వెళ్తారని చెప్పారు. రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో పది నిమిషాలకోసారి రైల్వే గేట్ వేయడంతో కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, అత్యవసర వైద్య సేవలు పొందేవారు 108 వాహనంలో వచ్చి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఇబ్బంది పడుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులకు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, సమస్యకు తాత్కాలికంగా అండర్ గ్రౌండ్ రహదారిని నిర్మించాలని కోరారు. ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆదెప్ప, తాయన్న, గోపాల్, పెద్ద మూకప్ప, నరసింహులు, దావీదు, దేవదాస్, రమేష్, ఈరన్న, నాగరాజు, నరసయ్య పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్న నాయకులు

ప్రజలతో మాట్లాడుతున్న శాంతి కుమార్

సంక్షేమ పథకాలతోనే పేదల అభివృద్ధి

- ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు శాంతికుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

సంక్షేమ పథకాలతోనే పేదల అభివృద్ధి సాధ్యమని వైసిపి యువ నాయకులు, ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతికుమార్ తెలిపారు. సోమవారం 'జగనన్న మా నమ్మకం, మా భవిష్యత్తు'లో భాగంగా దేవనకొండ గ్రామంలోని పాత మార్కెట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇంటి దగ్గరికి వెళ్లి ముఖ్యమంత్రి అందిస్తున్న పథకాల గురించి, జగనన్న చేసిన మేలు గురించి వివరించారు. వాలంటీరు రమేష్

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు...

- బీసీ కాలనీలో రెండేళ్లుగా వేధిస్తున్న మురుగు నీటి కాలువ సమస్య

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ఇంగలదహాల్ గ్రామం బీసీ కాలనీలో దాదాపు రెండేళ్ల నుంచి మురుగు కాలువ సమస్య వేధిస్తోంది. గతేడాది నుంచి గ్రామ సభలో విన్నవించుకున్నా అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. జగనన్న కాలనీకి రోడ్డు వేసేందుకు మట్టి వేయడంతో మురుగునీరు ముందుకు వెళ్లకుండా రోడ్డుపైకి వస్తోంది. రోడ్డే మురుగు కాలువలా మారిపోయింది. రోడ్డుపై మురుగునీరు నిలవడంతో కాలనీ ప్రజలు ఆ రోడ్డు గుండా వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి చాలా ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వెంటనే మురుగు కాలువలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి రోడ్డుపై మురుగు నీరు రాకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు

రాఘవేంద్రుని సన్నిధిలో రాష్ట్ర మంత్రి ఉషాశ్రీ చరణ్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషాశ్రీ చరణ్ సోమవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆమెకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం దివాన్ సుధీంద్రాచార్ ఆమెకు పసుపు, కుంకుమ, చీర, రవికతో పాటు మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి సిఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణు గోపాల్ రాజు, మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు ఆధ్వర్యంలో తగిన భద్రత కల్పించారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న మంత్రి ఉషాశ్రీ చరణ్

కేవలం తిట్టేందుకే లోకేష్ పాదయాత్ర చేస్తున్నట్లుంది : ఉషాశ్రీ చరణ్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కేవలం మంత్రులను, ఎమ్మెల్యేలను తిట్టేందుకే పాదయాత్ర చేస్తున్నట్లుందని రాష్ట్ర మంత్రి కెవి.ఉషాశ్రీ చరణ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. టిడిపి చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో ప్రజలకు మేనిఫెస్టో ద్వారా వివరించకుండా కేవలం మంత్రులను, ఎమ్మెల్యేలను విమర్శిస్తున్నారని తెలిపారు. లోకేష్ పాదయాత్ర వల్ల ఒరిగేదేమీ లేదని విమర్శించారు. అసలు టిడిపి 2014–2019లో ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రతి ఇంటి పెద్ద కొడుకులా ఉన్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సమ న్యాయం చేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీమఠంలో అధమర్ మఠం పీఠాధిపతులు శ్రీవిశ్వప్రియ తీర్థులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని అధమర్ మఠం పీఠాధిపతులు శ్రీవిశ్వప్రియ తీర్థులు దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, పండితులు, సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు వేద మంత్రాలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూలబృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఊయల మండపంలో పండితులతో చర్చాగోష్టి నిర్వహించారు. రాష్ట్రపతి ప్రతిభ అవార్డు గ్రహీత డాక్టరేట్ పండిత కేసరి మహా మహోపాధ్యాయ బిరుదాంకితులు రాజా ఎస్.గిరియాచార్యులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీవిశ్వప్రియ తీర్థులు

మహారాజ శ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
IA 1259/2022 OS 578/2022
K.కుమార్.
...అర్జీదారు
-Vs-
నిరంజన్ గౌడు S/o పుల్లయ్య
కంబాలపాడు (గ్రామం), క్రిష్ణగిరి (మండలం),
కర్నూలు (జిల్లా). ...రెస్పాండెంట్
నోటీసు
సదరు నెంబరు లోని అర్జీదారుడు రెస్పాండెంట్ అయిన మీపై ప్రాంసరీ నోటు బాకి నిమిత్తము రాబట్టుకొనుటకై దావా మోషన్ దాఖలు చేసియున్నాడు. ఈ విషయమై మీకు ఆక్షేపణలు వున్న ఎడల 12/05/2023వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు గానీ మీ తరపున వకీలు ద్వారా గానీ పై కోర్టులో మీరు హాజరై పై కోర్టు వారితో ఆక్షేపణలు తెలియజేయవలెను. అట్లు లేని యెడల సదరు విషయమై నీ పరోక్షముగా విచారించి తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 12/05/2023
జి.శేషశయనరావు,
యం. శ్రీరాములు,
అర్జీదారు పరం అడ్వకేట్స్,

మహారాజ శ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
OS 578/2022
K.కుమార్. ...వాది
-Vs-
నిరంజన్ గౌడు S/o పుల్లయ్య,
ఇంటి నెం.1-4, కంబాలపాడు (గ్రామం),
క్రిష్ణగిరి (మండలం), కర్నూలు (జిల్లా). ...ప్రతివాది
దావా సమను
పై నెంబరు దావాలోని వాది పై ప్రతివాదివి అయిన నీవు ఇవ్వవలసిన ప్రాంసరి బాకి రాబట్టుటకు గాను దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావా 12/05/2023న వున్నది. దావా నందు ప్రతివాది అయిన నీవు పై తేదిన ఉదయం 10.30 గం॥లకు మీరు గానీ మీ తరపున వకీలు గారు గానీ హాజరై పై కోర్టు నందు ఆక్షేపణలు తెలియ జేసుకోనవచ్చును లేనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 12/05/2023
జి.శేషశయనరావు,
యం. శ్రీరాములు,
వాదిపరం న్యాయవాదులు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440336016

మహారాజ శ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P 283/2022 in OS 29/2020
E.లత.
...డిక్రీహోల్డర్
-Vs-
M. రామాంజినేయులు Senior ED
Rep by his Lrs
M. రంగమ్మ & వగైర
1) M. రంగమ్మ W/o Late రామాంజినేయులు
2) M. వీరేష్ S/o Late రామాంజినేయులు
All R/o B/C4 B.Camp, కర్నూలు (టౌన్),
కర్నూలు (జిల్లా). ...జెడ్జిమెంట్‌డెటార్స్
O 21 RULE 52
సదరు నెంబరు లోని డిక్రీహోల్డర్ మీపై అమలు దావాను దాఖలు చేసివున్నారు. వారికి రావాల్సిన పైకము కొరకు పై కోర్టులో అమలు చేసి యున్నారు. ఈ విషయమై మీకు ఆక్షేపణ నున్న ఎడల 02/05/2023 వ తేదిన ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో మీరు హాజరై పై కోర్టు వారికి ఆక్షేపణలు తెలుపుకొనవెలను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమందు విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 02/05/2023
జి.శేషశయనరావు,
యం. శ్రీరాములు,
అర్జీదారు పరం అడ్వకేట్స్,
డోన్, నంద్యాల జిల్లా.

భూసార పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి : ఎడిఎ

ప్రజాశక్తి-ఆలూరు

రైతులు భూసార పరీక్షలు చేయించుకొని ఏ పంటలు వేసుకోవాలో తెలుసుకోవాలని ఆలూరు వ్యవసాయ విస్తరణ అధికారి (ఎడిఎ) సునీత తెలిపారు. సోమవారం ఆలూరు మండలస్థాయి భూసార శిక్షణలో భాగంగా మట్టి నమూనా సేకరించారు. వాటి పరీక్షల ద్వారా ఆ భూమిలో ఏయే పంటలు వేయాలో ఎంత మేర పోషకాలు ఉన్నాయో తెలుసుకొని ఎంత మేర ఎరువులు వాడాలో అని తెలుసుకోవాలన్నారు. రైతులు ఆర్‌బికె పరిధిలో తమ పొలాల మట్టిని పరీక్ష కేంద్రానికి పంపాలని తెలిపారు. ఎఒ వెంకటేశ్వర గౌడ్, హబ్ మేనేజర్ రాజేష్ గౌడ్, ఆర్‌బికె ఇన్‌ఛార్జీలు, మిత్రలు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

- వరిగడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుదాఘాతంతో చెలరేగిన నిప్పులు

ప్రజాశక్తి - హొళగుంద

వరి గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుదాఘాతంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని వందవాగిలి గ్రామానికి చెందిన రైతు కురువ నాగరాజు తన పొలంలో ఉన్న వరిగడ్డిని సోమవారం ట్రాక్టర్‌లో ఇంటి పక్కన గడ్డివాములోకి తీసుకొస్తుండగా పైన వెళ్లిన విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతం చోటు చేసుకుంది. గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్‌కు నిప్పంటికుంది. అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్‌లో ఉన్న గడ్డిని ట్రాలీ లిఫ్ట్ ద్వారా కిందికి వదిలే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు కూడా సహకరించడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రాణ నష్టం జరగకపోవడంతో గ్రామస్తులకు ఊపిరి పీల్చుకున్నారు. ఎండలు మండుతుండడంతో అక్కడక్కడ విద్యుదాఘాతాలు జరుగుతున్నాయని, విద్యుత్ లైన్లు వెళ్లిన ప్రాంతాలకు దూరంగా ఉండి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం

- ఫ్రెండ్లీ రాజకీయాలు కొనసాగిస్తాం - జనసేన నేత, సినీ నిర్మాత రూపా జగదీష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని, అందుకనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రణాళికబద్ధంగా పని చేయాలని ఎమ్మిగనూరు జనసేన పార్టీ నేత, సినీ నిర్మాత ఐ.రూపా జగదీష్ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్ఎంటి కాలనీ వద్ద ఉన్న ఐజెకె సొల్యూషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రజా పోరాటాలు, సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై నాదెండ్ల మనోహర్, జిల్లా కన్వీనర్ చింత సురేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు తెలిపారు. జనసేన తాలూకా ఇన్‌ఛార్జీ రేఖాగౌడ్ తన కార్యాలయానికి వచ్చి తనను పార్టీలోకి ఆహ్వానించారని చెప్పారు. ఎమ్మిగనూరులో ఫ్రెండ్లీ రాజకీయాలు కొనసాగిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి, బిజెపి ఇన్‌ఛార్జీ కెఆర్.మురారి రెడ్డి, సిపిఎం, సిపిఐ, ఆప్, బీఎస్పీ నాయకులతో సాన్నిహితంగా ఉన్నానని చెప్పారు. తాను పోలీసుగా పని చేసే సమయంలో ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించానని తెలిపారు. అదే తరహాలో ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకుంటానని, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. అంతకముందు పొనకలదిన్నె దర్గా ముత్తవల్లి సయ్యద్ ఖాద్రీ బాష మాట్లాడుతూ... జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలతో మిత్రుడు రూపా జగదీష్ అంకితభావం, సేవా కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరానని తెలిపారు. అనంతరం జనసేన చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాదుగుండు శివ ఆధ్వర్యంలో రూపా జగదీష్, సయ్యద్ ఖాద్రీ బాషను సన్మానించారు. జనసేన పార్టీ నాయకులు బీసీ.నాగరాజు, టైలర్ బాబు, గాజుల వెంకటేష్, ఎంఎస్ నగర్ శివ, కె.తిమ్మాపురం మంజునాథ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేత రూపా జగదీష్

ప్రజలకు మినరల్ వాటర్ అందించడం హర్షణీయం

- దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఏదైనా పని చేయాలని అనుకున్నప్పుడు, అది తప్పనిసరిగా నిర్వర్తించి పూర్తి చేయగల సామర్థ్యం ఉన్న వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ సొంత నిధులతో మినరల్ వాటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు చాలా సంతోషంగా ఉందని దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం తండ్రి గుమ్మనూరు బసప్ప తెలిపారు. సోమవారం గుమ్మనూరు గ్రామంలో గుమ్మనూరు నారాయణ సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ కేంద్రాన్ని సర్పంచి పచ్చర్లపల్లి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు బసప్పలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుమ్మనూరు గ్రామ ప్రజలకు వేసవిలో మినరల్ వాటర్ అందించడం శుభ పరిణామమని తెలిపారు. ఆర్‌బికె ఛైర్మన్ కమలమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, వైసిపి సీనియర్ నాయకులు విక్రాంత్ రెడ్డి, శ్రీధర్, నారి పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

20 నుంచి ఆదోనిలో 'యువగళం పాదయాత్ర'

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలోని పెద్దపెండేకల్ గ్రామం నుంచి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర గురువారం ప్రారంభమవుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరేకల్ గ్రామం మీదుగా కొనసాగి నాగలాపురం వద్ద మధ్యాహ్నం 12 గంటలకు భోజన విరామం ఉంటుందని తెలిపారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమై బైచిగేరి క్రాస్ నుంచి ఒక కిలోమీటర్ పాదయాత్ర కొనసాతుందని చెప్పారు. తర్వాత సూపర్ ఫంక్షన్ హాలు పొలం దగ్గర రాత్రి బస ఉంటుందన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభమై ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మీదుగా తిక్కస్వామి దర్గా మీదుగా చందసాబ్ దర్గా, నిర్మల్ టాకీస్, పాత బస్టాండ్, మేదరి గేరి, కొత్త బ్రిడ్జి మీదుగా రాయలసీమ మిల్లు

కుడి పక్కన ఖాళీ స్థలంలో మధ్యాహ్నం భోజన విరామం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమై ఇస్వి దర్గా, కడితోట రోడ్డు పక్కన సాయంత్రం 5 గంటలకు పబ్లిక్ మీటింగ్ జరుగుతుందన్నారు. అనంతరం పాదయాత్ర ప్రారంభమై ఒక కిలోమీటర్ తర్వాత రోడ్డు సైడ్ పొలంలో రాత్రి బస చేస్తారని తెలిపారు. శనివారం పాదయాత్ర ఉదయం 8 గంటలకు ప్రారంభమై పెద్దతుంబలం గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలో భోజన విరామం ఉంటుందని చెప్పారు. తర్వాత సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర ప్రారంభమై పెద్దతుంబలం గ్రామం గుండా కోసిగి రోడ్డు 8వ కిలోమీటర్ నెంబరు రాయి వరకు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అక్కడ రోడ్డు సైడ్ ఖాసీం పొలంలో రాత్రి బస చేస్తారని తెలిపారు. ఇక్కడి నుంచి కోసిగి మీదుగా మంత్రాలయం నియోజకవర్గంలో యాత్ర కొనసాగుతుందని వివరించారు. యువగళం పాదయాత్రలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలకు వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

సంక్షేమ పథకాల అమలులో దేశానికే రాష్ట్రం తలమానికం

- వైసిపి రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి తలమానికమని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. సోమవారం కుంటనహాల్ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా ఉన్నాయో, ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇంకా సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారికి అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు ప్రదీప్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సరఫరాలో ఎందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బంది వచ్చినా స్థానిక నాయకుల దృష్టికి తీసుకు రావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఛైర్మన్ నాగరాజు గౌడ్, మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఏకం రెడ్డి, రామన్న గౌడ్, ఎంపిపి అమ్రేష్, చెన్నప్ప, శివరాం, సిద్ధప్ప, సుధాకర్ రెడ్డి, పాండురంగారెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

'అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన అవసరం'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని స్థానిక అగ్నిమాపక అధికారి జి.రామాంజనేయులు తెలిపారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు తిరుమల నగర్‌లోని గుడ్ బేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అగ్ని ప్రమాదాలు, గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, గ్యాస్ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. కరస్పాండెంట్ వై.వాసు బాబు, ప్రిన్సిపల్ ఎం.అఖిల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
మంగళవారం 18 ఏప్రిల్ 2023
5
నంద్యాల

తాటి నుంజలతో వేసవి ఉపశమనం

ప్రజాశక్తి - బనగానపల్లె

వేసవికాలం ప్రారంభం నుండే భానుడి విశ్వరూపం ప్రదర్శిస్తున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రతతో పాటు వడగాలు ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రజలు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తాటి నుంజలను ఆశ్రయిస్తున్నారు. బనగానపల్లె మండలంలోని చిన్న రాజుపాలెం, క్రిష్ణగిరి తాటి వనం నుండి, అవుకు మండలంలోని అవుకు రిజర్వాయర్ ప్రాంతం నుండి తాటి నుంజలను తెచ్చి బనగానపల్లె పట్టణంలో అమ్ముతున్నారు పట్టణంలోని పాత బస్టాండ్, కూరగాయల మార్కెట్, మైనర్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద ,పెట్రోల్ బంకు సమీపంలోని పోలీస్ స్టేషన్‌ల వద్ద తాటి కాయలను తెచ్చి నుంజలను తీసి అమ్ముతున్నారు. వీటితోపాటు నీడను ఇచ్చే చెట్ల కింద తాటి నుంజల వ్యాపారం పట్టణంలో జోరుగా సాగుతుంది. ఐస్ యాపిల్‌గా పేరుగాంచిన నుంజలు వేసవికాలంలో శరీరానికి చలువ చేయడంతో పాటు అజీర్తిని తగ్గిస్తాయి. గుండె జబ్బులను దూరం చేస్తాయి. పారదర్శకంగా జెల్లిలా జారిపోయే వీటిని తినేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. డజన్ 70 రూపాయల చొప్పున అమ్ముతుండడంతో ప్రజలు అధికంగా తాటి ముంజులను కొనుగోలు చేసి వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. ప్రజలకు తక్కువ రేటుకు లభిస్తుందడం, అప్పటికప్పుడే కాయల నుంచి నుంజలను తీసి ఇస్తుండడంతో అందరూ కొనుగోలు చేస్తున్నారు. తాటి నుంజల వ్యాపారం చేసుకునే వారికి కూడా రోజుకు ఖర్చులు పోను 600 నుండి 800 రూపాయలు మిగులుతున్నట్లు చిన్న రాజుపాలెం గ్రామానికి చెందిన కృష్ణానాయక్ తెలిపారు. ప్రజలకు వేసవి తాపాన్ని తీరుస్తున్న తాటి నుంజలు కూలి పని చేసుకుని అమ్ముకునే వారికి కూడా గిట్టుబాటు అవుతున్నాయి. దీంతో పట్టణంలో తాటి నుంజల వ్యాపారం జోరుగా సాగుతుంది.

బిజెపికి రాజకీయ సమాధి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రజలపై విచ్చలవిడిగా భారాలు వేస్తూ.. నిరంకుశ పాలన సాగిస్తున్న బిజెపికి రాజకీయ సమాధి కట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు పేర్కొన్నారు. సోమవారం మిద్తూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచార భేరిని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపైన విచ్చలవిడిగా పన్నులు వేసి ఆదాని, అంబానీ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. సమస్యలను పక్కదారి పట్టించేందుకు బిజెపి మత రాజకీయాలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. మిడుతూరు మండలానికి హంద్రీనీవా ద్వారా సాగు తాగునీరు అందించాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి వెంకటేశ్వర్లు, పకీర్ సాహెబ్, బేస్తరాజు, గోపాలకృష్ణ గ్రామస్తులు వెంకటేశ్వర్లు, సోఫ్ సాహెబ్, మనన్, జయన్న, కలాం, అజీస్, సంజన, ఎలా నాగన్న తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని సిపిఐ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బిజెపి పరిపాలనలో ప్రమాదంలో పడిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్ బాబా ఫక్రుద్దీన్, మండల కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నా గరాముడు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా కార్యదర్శి శివయ్య, ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** మండలంలో రెండో రోజు ప్రచారభేరీ కొనసాగింది. లింగాల నాగంపల్లి, చెలిమిల్ల, మద్దూరు, వానాల, మిట్ట కందల గ్రామాలలో జాత **(మిగతా 6వ పేజీలో..)**

మిడుతూరు మండలంలోని చేపట్టిన ప్రచార భేరిలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎం.నాగేశ్వరరావు

నంద్యాల రూరల్ : చాపిరేవుల గ్రామంలో ప్రచార భేరి కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు

సైబర్ మాయ

- జిల్లాలో తరచూ సైబర్ నేరాలు
- మోసపోతున్న సామాన్యులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సామాన్యులు సైబర్ వలలో పడుతున్నారు. మాయమాటలతో మోసపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో తరచూ సైబర్ నేరాలు ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి...

జిల్లాలో తరచూ సైబర్ నేరాలు జరుగుతున్నాయి. అమాయకత్వం అత్యాశతో ప్రజలు నేరగాళ్లకు చిక్కి మోసపోతున్నారు. కర్నూలు లో ఓ యువకుడి విదేశీ ఉద్యోగం నేపథంతో ఏకంగా రూ.20 లక్షలు మోసపోయాడు. ఇటీవల కొందరు ప్రముఖ సంస్థల వస్తువుల వార్షికోత్సవ సందర్భంగా తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు రైతుల పేరుతో సామాజిక మధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చి మోసగిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాలోని పలువురు పోలీస్ అధికారుల పేరుతో ఖాతాలు తెరిచి వారు సన్నితులను డబ్బులు అ ఖాతాల్లో వేయించుకునే ప్రయత్నం చేశారు. కరోనా సమయంలో భీమా సొమ్ము పేరుతోనే మోసాలకు పాల్పడ్డారు. సామాజిక మధ్యమాల్లో పరిచయమైన వ్యక్తులు నమ్మి పంపిన చిత్రాలు వీడియోలతో బ్లాక్ మెయిల్‌కు గురైన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కొంతకాలంగా పెట్టుబడుల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రూ. లక్ష పెట్టుబడిగా పెడితే నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు పొందవచ్చని ఏడాదికి రెట్టింపు ఆదాయం అంటూ సైబర్ నేరగాళ్లు పలు నకిలీ వెబ్‌సైట్ల ప్రకటనలతో అమాయకులను ఆకర్షితం చేస్తున్నారు. పెళ్లి సంబంధం వెబ్‌సైట్‌తో మోసపోయిన బాధితులు ఉన్నారు.

అంతర్జాలాన్ని ఆసరాగా చేసుకునే సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త విధానాలతో అమాయకుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. రోజురోజుకీ బాధితుల సంఖ్య పెరిగిపోతున్నాయి. సుదూర రాష్ట్రాల నుంచి నేరాలకు పాల్పడుతుండడం, నిందితులను పట్టుకొనిసొమ్ము రికవరీ చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. 2021లో 44 నేరాలు జరుగగా 2022 సంవత్సరంలో 58 నేరాలు జరిగాయి. గతం ఏడాదికన్నా 14 కేసులు పెరిగాయి.

గతంలో పలు ఘటనలు

నైజీయా కు చెందిన సైబర్ నేరగాళ్లు ఎమ్మిగనూరుకు చెందిన ఒక వ్యక్తిని పరిచయం చేసుకున్నాడు. యూకేలో నూనె వ్యాపారం చేస్తున్నట్లు నమ్మించారు. ముంబాయిలో ముడిసరుకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. తమది విదేశీ సంస్థ అయినందుకు ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నామని భాగ్యస్వామి గా చేరితే తక్కువ చెల్లించవచ్చునని చెప్పారు. దీంతో ఆయన ఏకంగా రూ.11.30 లక్షలు వారి

పారిశుధ్య చర్యలు ముమ్మరం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేసి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం నిర్వమించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, ఇంచార్జి డిఆర్ఓ కామేశ్వరరావు తదితరులు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై సత్వరమే స్పందించి నాణ్యతతో ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వసతి గృహాల్లో కూడా పారిశుధ్య చర్యలు పాటిస్తూ విద్యార్థుల్లో రక్తహీనత అధిగమించేందుకు మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన ఆహార పదార్థాలను అందజేయాలన్నారు. వసతి గృహాలను హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తరచూ తనిఖీలు చేస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. వడగాల్పులపై ప్రజల అప్రమత్తమయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

హస్త కళాకారుల సమస్యల పరిష్కారానికి

- రాష్ట హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బి.విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

హస్త కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళిలు అన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటనలో భాగంగా సోమవారం ఆళ్లగడ్డలోని ఆచారికాలనీలో చెక్కతో వివిధ రకాల బొమ్మలు, ఫర్నీచర్, తయారీ హస్త కళాకారులను కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డిసిహెచ్ నుండి గుర్తింపు కార్డ్స్ ఇప్పించాలని, ఉడ్ కార్వింగ్ వేంకటేశ్వర స్వామి, సుబ్రమణ్య స్వామి బొమ్మల తయారీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇప్పించాలని కోరారు. లేపాక్షి ఎంపోరియం ల ద్వారా తాము తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన చైర్ పర్సన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏపిహెచ్డిసి కర్నూలు మేనేజర్ తిమ్మయ్య, సిబ్బంది కిషోర్, స్థానిక వైసిపి నాయకులు అహమ్మద్, హస్త కళాకారులు పాల్గొన్నారు.

చెక్కతో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న చైర్మన్ బి.విజయ లక్ష్మి తదితరులు

రంజాన్ వేళలు

మంగళవారం
ఇఫ్తార్ : 6 : 38

బుధవారం
సహెరి : 4 : 36

అరటి తోటలు దగ్ధం - రూ.6 లక్షలు నష్టం

ప్రజాశక్తి - మహానంది : మండలంలోని గాజులపల్లె గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు సాగు చేస్తున్న అరటి తోటలు ప్రమాదవశాత్తు సోమవారం మధ్యాహ్నం కాలి దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు 6 లక్షల రూపాయలకు పైగా పంట నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. పాత బసవాపురం ప్రాంతంలోని అబ్దుల్ హమీద్, షేక్ మహాభి, షేక్ మహబూబ్ షరీఫ్‌లకు చెందిన గెలలతో ఉన్న అరటిపంట, డ్రిప్పు పైపులు, పరికరాలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. బాధిత రైతులకు సమాచారం అంది అక్కడికి వెళ్లి చూసుకోగా బూడిదనే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు పంట నష్టం పరిశీలించి బాధిత రైతులకు నష్టపరిహారం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు, బాధితులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు అధికారులను కోరారు. సోమవారం పాణ్యం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ మల్లికార్జున రెడ్డికి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కె.శ్రీనివాసరావు, బత్తిని ప్రతాప్‌లు మాట్లాడుతూ తాగునీరు, మహిళలకు మరుగు దొడ్లు, బస్ సమాచారం కౌంటర్, విద్యార్థులకు బస్సు పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కార్తీక్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చవిరెడ్డి గారి సుధాకర్ రెడ్డి (45)అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా గ్రామానికి చేరుకుని టిడిపి నాయకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మహానంది : మండలంలోని బుక్కాపురం గ్రామంలో ఉపాధి పనులను ఎంపిటిసి కుంచపు లక్ష్మీ నరసమ్మ, సర్పంచి కందుల వరలక్ష్మమ్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పిస్తున్నామని తెలిపారు. కూలీలు అందరూ సమయపాలన పాటించి పనులు సక్రమంగా చేయాలని సూచించారు.

దేవనకొండ మండలంలో 'యువగళం'

- రైతులతో లోకేష్ ముఖాముఖి
- సమస్యలు విన్నవించిన పలువురు

ప్రజాశక్తి- దేవనకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర సోమవారం ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండలంలో సాగింది. ఎంకే కొట్టాల నుండి గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బుర్రకుంట, వెంకటాపురం గ్రామాల మీదుగా సాగింది. ఆయా గ్రామాల్లో నారా లోకేష్ యువగలం పాదయాత్రకు జననీరాజనం పట్టారు. టిడిపి నాయకులు నీలకంఠం, రాందాస్ గౌడ్ ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో గజమాలను లోకేష్, కోట్ల సుజాతమ్మకు వేశారు. గుడిమిరాళ్ల గ్రామస్తులు హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా పి కోటకొండ వరకు పిల్ల కాలువల నిర్మాణాలను చేపట్టి సాగు నీరు ఇవ్వాలని వినతి పత్రం రమణారెడ్డి ఆధ్వర్యంలో సమర్పించారు. సబ్సిడీ ద్వారా గొర్రెల పెంపక దారులకు గొర్రెల యూనిట్లు, మందులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన నారా లోకేష్ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేస్తామన్నారు. బుర్రకుంట సమీపంలో ఆలూరు నియోజకవర్గం పరిధిలోని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వివిధ మండలాల రైతులు రైతాంగ సమస్యలను విన్నవించారు. ఆస్పరి, దేవనకొండ ప్రాంతాల రైతులు అధిక విస్తీర్ణంలో టమోటా పంటను సాగు చేస్తారని జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని విన్నవించారు. అందుకు స్పందించిన ఆయన జ్యూస్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తెర్నేకల్ గ్రామ రైతు ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు చెల్లిస్తున్న వేతనాల్లో కోత విధించారని, హంద్రీనీవా పంట కాలువల అసంపూర్తిగా ఉన్నాయని తక్షణమే వాటిని పూర్తి చేయించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారన్నారు. పొట్లపాడు రైతు లక్ష్మన్న మాట్లాడుతూ ఉల్లి పంటకు గిట్టుబాటు ధర గత రెండేళ్లుగా లేకపోవడంతో రైతుల తీవ్ర అవస్థలు పడుతున్నారని దీంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. కర్నూలు జిల్లాకు పరిశ్రమలు పెట్టడానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వ్యాపార వర్గాల నుండి తెప్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఉపాధి హామీ ద్వారా వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేసి పండ్ల తోటల పెంపకాన్ని రైతులతో చేపట్టి వారి అబివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో పెండింగ్లో ఉన్న వేదవతి, నగర డోనా, హంద్రీనీవా, ఎల్ఎల్‌సి, ఆర్డీఎస్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, ఆలూరు, మంత్రాలయం, ఆత్మకూర్ టిడిపి ఇన్చార్జిలు కోట్ల సుజాతమ్మ, తిక్కా రెడ్డి, ఏరాసు ప్రతాపరెడ్డి, ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జీలు వీరభద్ర గౌడ్, వైకుంఠ మల్లికార్జున చౌదరి, టిడిపి పారిశ్రామికవేత్త మాజీ ఇంచార్జ్ వైకుంఠం శివప్రసాద్ ఆయన భార్య జ్యోతి, మసాలా పద్మజ, ఆస్పరి మాజీ జెడ్పిటిసి కప్పట్రాళ్ల బోజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, మండల టిడిపి కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, నాయకులు బడి గింజల రంగన్న, రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, వెంకట స్వామి గౌడ్, రాజశేఖర్ గౌడ్, బండ్లయ్య, మాలిక్ బాషా, రాజా సాబ్, సర్పంచులు శేషి రెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారా లోకేష్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - నంద్యాల

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి రఘురాం మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్యలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగం చేసి, కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం అన్యాయమన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రైవేటీకరణ ఆపాలని అఖిలపక్షం ఏర్పాటు చేసుకొని పోరాటంలో కలిసి రాకపోతే ప్రజా, కార్మిక వ్యతిరేకతకు గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రసాద్, డి.శ్రీనివాసులు, సోమన్న, భూమని శ్రీనివాసులు, సుబ్బ రాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న నాయకులు

జిఓ 52ను రద్దు చేయాలి

- ఆలిండియా బంజారా సేవా సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాలరూరల్

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే జీవో 52ను అసెంబ్లీలో ప్రవేశపెట్టి తీర్మానం చేయడం దారుణమని, వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాల నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డుమావత్ స్వామి నాయక్‌లు డిమాండ్ చేశారు. జీవో 52ను వెంటనే రద్దు చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల మండలం లోని అబాండం తండాలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ నాయక్ అధ్యక్షతన పెద్దలు, యువకులు, మహిళలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో 52ను తీసుకురావడం దారుణమని, వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాస్తారోకో చేస్తున్న దృశ్యం

19న ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని కడప రోడ్డులో గల మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 19న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డిలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మసీదులు, బృందావనం కాలనీ ఎదురుగా ఉన్న దివ్యజ్ఞాన మందిరానికి ఎమ్మెల్యే వెళ్లి ముస్లిం మత పెద్దలను ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు. కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, కాటన్ బోర్డ్ మాజీ డైరెక్టర్ చింతకుంట్ల శ్రీనివాసరెడ్డి (వాసు), మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, నాయకులు, కాంట్రాక్టర్ నజీర్, బీరువాల భాష, మౌలాలి, కందుకూరు గోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, అమీర్ భాష తదితరులు ఉన్నారు.

రోడ్ కం బ్యారేజీ నిర్మించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

సంగమేశ్వరం వద్ద రోడ్ కం బ్యారేజీని నిర్మించాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్‌విఎస్ సీమకృష్ణ డిమాండ్ చేశారు. రాయలసీమ హక్కుల కోసం కర్నూలు పట్టణంలో ఈనెల 24న ఎస్‌టిబిసి మైదానంలో జరిగే ఒక్క రోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు చేతులు మీదుగా రాయలసీమ కర్తవ్య దీక్ష కరపత్రాన్ని రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రాము, రవీంద్ర, నాగభూషణం, బజారి, గోపాల్ రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** రాయలసీమ హక్కుల కోసం కర్నూలు పట్టణంలో ఈనెల 24న ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో జరిగే ఒక్క రోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని జివి కొండారెడ్డి మెమోరియల్ గ్రంథాలయంలో రాయలసీమ కర్తవ్య దీక్ష కరపత్రాన్ని రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. నాయకులు కామిని వేణుగోపాల్ రెడ్డి, గడ్డం అమరనాథ్ రెడ్డి,కరీం భాష, ఆర్‌విఎస్ సీమకృష్ణ, సుధాకర్, రాము, రవీంద్ర, నాగభూషణం, బజారి, గోపాల్, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్ష పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐ సుబ్బరాయుడు

వృద్ధురాలు నుండి ఫిర్యాదు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీసుల స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఎక్కువగా సివిల్, అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేదింపులపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదిదారులకు ఓంకారం ధేవస్థానం వారిచే భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నంద్యాల టౌన్ డిఎస్పి సి.మహేశ్వర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరిబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే అమేచూర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నంద్యాల ఎన్జీవోస్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య విద్యాసంస్థ ఎన్-3 బ్రాంచ్‌లో ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. జి. రవికృష్ణ పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలకు చెందిన హర్షవర్ధనాచారి మొదటి స్థానం, శ్రీనాథ్ రెడ్డి రెండవ స్థానం కైవసం చేసుకున్నారని, వీరు రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టులో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ జోనల్ ఆర్ఐ. చౌదరి, ఎన్-3 బ్రాంచ్ ప్రిన్సిపల్ మౌలాలి బీబీ, ఎస్‌బిఐ మేనేజర్ వినయ్ సాగర్, టోర్నమెంట్ ఆర్గనైజర్ రాజా రమేష్ చక్రవర్తి, చీఫ్ ఆర్బిటార్ ఇమాముసేన్, ఆర్బిటార్ సుజాత, రవి నాయక్, సునీత్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న ఎస్ఐ తదితరులు

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి -చాగలమర్రి

పట్టణంలోని మల్లెవేముల బస్టాండు సమీపంలో ఆల్‌ఖైరా ఎడ్యు కేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ తోఫా కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కిట్లను సుమారు 150 మంది నిరు పేదలకు ఎస్ఐ రమణయ్య, వైసీపీ రాష్ట మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్‌లు పంపిణీ చేసారు. అనంతరం ట్రస్టు అధ్యక్షులు మౌళానా అబ్దుల్ మజీద్ ఆరీఫ్ మాట్లాడుతూ ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా మరిన్నీ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కమ్యూనికేషన్ సభ్యులు మౌలానాలు అబ్దుల్ సమ్మద్, సుభహాన్, సలాం, సులేమాన్ ,తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -ప్యాపిలి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తూరు చిన్న అంజి అన్నారు. సోమవారం నాడు జలదుర్గం గ్రామంలో బి.ఆర్. అంబేద్కర్ విగ్రహంను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసి నందుకు ధన్యవాదాలు తెలిపారు. లాయర్ విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్క ఫక్కిరప్ప,రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు ఆవుల రాము, డోన్ గౌరవాధ్యక్షులు చంద్ర మోహన్,నాగరాజు, ప్యాపిలు మండల సెక్రెటరీ మధుకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రుడు,కాసి మద్దిలేటి,దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అందడం లేదు : టిడిపి

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఉచిత వైద్య సేవలు అందడం లేదని టిడిపి నాయకులు రేడియం నూర్. పస్పుల్ మున్నా, ఆసీస్ బిగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 5,6 వార్డుల్లో నంద్యాల శాంతిరాం వైద్యశాల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో వైద్య సేవలు అందించడం జరుగిందన్నారు.

నంద్యాల టూ జమ్మలమడుగు హైవే రగడ

- సర్వే పనులను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల నుండి జమ్మలమడుగు వెళ్లే హైవే రహదారి విషయంలో సర్వే అధికారులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నంద్యాల మండలంలోని కానాల గ్రామ పరిధిలో నంద్యాల నుండి జమ్మలమడుగు వెళ్ళు జాతీయ రహదారి కొరకు సోమవారం సర్వే పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రైతులు పురుగుల మందు డబ్బాలతో బయలుదేరి పనులను అడ్డుకున్నారు. పాలకులకు అమ్ముడుపోయి పేదలమైన మా భూ ములలో రహదారి కొరకు సర్వే చేస్తున్నారని, పాలకులు లబ్ధి పొందడానికి చేస్తున్న దుర్మార్గమైన చర్య అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సర్వే అధికారులకు, రైతులకు మధ్య ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు సర్ది చెప్పారు.

విమర్శించే ముందు స్థాయి తెలుసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఒకరిని విమర్శించే ముందు మన స్థాయి ఏమిటో తెలుసుకోవాలని, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి చరిత్ర కలిగిన భూమా దంపతుల కుమారుడన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని టిడిపి నాయకులు, మాజీ కౌన్సిలర్ కృపాకర్, నాయకులు అన్నెం చౌదరి, భాస్కర్ రెడ్డిలు తెలిపారు. సోమవారం నంద్యాలలోని భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వివాదాస్పద స్థలం విషయంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి గురించి అసందర్బ వాక్యలు చేశారన్నారు. ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి జగత్ కు లేదని, ఎక్కడినుండో ఎవరెవరో నంద్యాలకు వచ్చి ఎమ్మెల్యే గురించి మాట్లాడుతున్నారని మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లినట్లు ఉందన్నారు. ముందు మీ నాయకులు ఎక్కడి నుండి వచ్చారో తెలుసుకోవాలని హితవు పలికారు. ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన భూమా కుటుంబం నుండి వచ్చిన జగత్ విఖ్యాత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత మీకుందా అని వారు ప్రశ్నించారు. కాబట్టి ఎవరి స్థాయి ఏమిటో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని వారు అధికార పార్టీ నాయకులకు హితవు పలికారు. సమావేశంలో ఇమ్మనియోల్, శరత్ బాబు, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 వరకు సాగునీరు అందించాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో..

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని తెలుగు గంగ ప్రధాన కాలువ కింద రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు మే 15వ తేదీ వరకు సాగునీరు అందించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, రైతు సంఘం జిల్లా నాయకులు తలారి రామచంద్రుడు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన బండి ఆత్మకూరు బస్టాండ్ వద్ద నంద్యాల ఆత్మకూరు ప్రధాన రహదారిలో రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు తలారి రామచంద్రుడు మాట్లాడుతూ వేలాది టీఎంసీల నీరుసముద్రం పాలైతున్న పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు వెలుగోడు రిజర్వాయర్‌లో ఏప్రిల్ మే లో ఐదు టీఎంసీల నీరు నిలువ ఉంచాలని రైతు సంఘంగా అనేకసార్లు విన్నవించిన పట్టించుకోకుండా ఇప్పుడు పంటలు సాగు చేసిన తర్వాత సాగునీరు అందించలేకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆరుగాలం కష్టంతో పండించే పంటలు చేజారిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సాగునీరు అందించి రైతన్నలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డేవిడ్ మాట్లాడుతూ మండలంలోని 3,4,5 బ్లాకులలో వరి పంటను సాగు చేయడం జరిగిందని, 15వ తేదీ వరకు సాగునీరు అందించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రవి, రైతు సంఘం ప్రజా సంఘాల నాయకులు రాజేష్, జాను, దానమయ్య, సిఐటియు నాయకులు రాజు, రైతులు రాముడు, మహేష్, సుబ్బరాయుడు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు పథకాలు : వైసిపి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని అహోబిలం గ్రామంలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అహోబిలానికి రూ.5 కోట్లతో రోడ్లు నిర్మాణం పూర్తి చేశామని, మరో 3కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో గంగుల విజయ సింహా రెడ్డి , ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, గంగుల రామిరెడ్డి, సర్పంచ్ నాసారి వీరమ్మ, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు(సీసా), వైస్ ఎంపీపీ నాసారి నరసింహ ప్రసాద్, వైస్ సర్పంచ్ సల్లా మధు యాదవ్ , వైసీపీ నాయకులు రామచంద్రుడు, నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్ దోరకొట్టల నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్లలో మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్నికేంద్ర కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి (వాసు), విజయ డైరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డిలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం వారిని స్థానిక నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. కౌన్సిలర్లు సూలం వెంకటసుబ్బమ్మ, గొట్లురు సుధాకర్ రెడ్డి, నాయకులు బద్రి భాస్కర్ రెడ్డి, కెకె రెడ్డి, మన్నే చిన్న రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో సోమవారం 18, 24 వార్డులు అర్బన్ కాలనీల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాజగోపాల్, కో ఆప్షన్ సభ్యుడు ఎంఎ రషీద్, కౌన్సిలర్లు యూనిస్, బోయ పార్వతి, తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లి ఈ ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి సంక్షేమ పథకాలు వివరించి, ప్రజల అనుమతితో వారి ఇంటికి స్టిక్కర్లు వేశారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

బేతంచర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, ఎంపీటీసీ నాగ శేషుల ఆధ్వర్యంలో మా నమ్మకం నీవే జగనన్న, గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, ఎంపీటీసీ నాగ శేషు మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యం రెడ్డి, గ్రామ కన్వీనర్ తిమోతి, ఎం శేఖర్ మధు తత్తలు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ప్రతి పౌరుడూ బిజెపిని నిలదీయాలి : సిపిఎం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, నిలదీయ వలసిన అవసరం వచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసు రత్నం, సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్ష, కార్యదర్శులు దర్శనం నాగరాజు, ఎం చిన్న మారన్న, సిఐటియు మండల నాయకులు మల్లికార్జున అన్నారు. సోమవారం శ్రీశైలం మండలం సుండి పెంట సిఐటియు కార్యాలయములో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి తర్వాత హామీలను తుంగలో తొక్కిందన్నారు. బిజెపిపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, విభజన హామీలు ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా చేసే ప్రచార భేరిని జయప్రదం చేయాలని వారు కోరారు. **ఆత్మకూర్:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయం, వివక్షపూరిత విధానాలు, ద్రోహానికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం మండల కార్యదర్శి నరసింహ నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని సుదర్శన భవనం నందు ప్రచార యాత్ర జయప్రదానికై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి ఆత్మకూరు మండలంలో ప్రచార భేరిని నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు.సిపిఎం నాయకులు సి.వెంకటేశ్వర్లు, మాభాష, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి నరసింహా నాయక్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రంలో సుజల పైప్స్ ప్రైవేటు లిమిటెడ్ నంద్యాల పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, ఆయిల్ ప్రమాదాలు, గ్యాస్ ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి, వాటిని ఎలా అదుపు చేసే పద్ధతులను ప్రాక్టికల్ డెమో ద్వారా చేసి చూపించారు. అగ్నిమాపక అధికారి యన్.జయన్న, సహాయ అధికారి బి.యోగేశ్వర రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదాలను నివారించే విధానంపై ప్రమాదంలో ఉన్న మనుషులను కాపాడే విధానంపై సోమవారం నాడు స్థానిక అగ్నిమాపక కేంద్ర అధికారి భీముడు నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది డెమో రూపంలో విద్యార్థులకు వివరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది నీటి విన్యాసాలను చేశారు.

బూజునూరులో భారీ చోరీ

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని బూజునూరు గ్రామానికి చెందిన ద్వారం జనార్దన్ రెడ్డి, శశికళకు చెందిన ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. వివరాలు.. కుటుంబ సభ్యులు రాత్రి ఇంటిపై నిద్రించారు. ఇదే అదనుగా భావించి దొంగలు ఇంటి కిటికీ తొలగించి బెడ్రూం తాళం పగలగొట్టి బీరువాను రాడ్‌తో కొట్టి 20 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి నగలను ఎత్తుకెల్లారు. బాధితుడు జనార్ధన్ రెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని పాణ్యం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై బిటి వెంకట సుబ్బయ్య పరిశీలించారు.

పశుగ్రాసం దగ్ధం

ప్రజాశక్తి - కొత్తపల్లి

విద్యుత్ తీగలు తగిలి పశు గ్రాసం దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే రైతు ట్రాక్టర్‌పై పశుగ్రాసాన్ని తెచ్చుకుం టుండగా విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. శ్రీకాంత్ అనే రైతు వనములపాడు గ్రామం నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేసుకుని ఎదురుపాడు గ్రామానికి ట్రాక్టర్‌పై తీసుకురావడంతో గ్రామంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే లోపు పూర్తిగా పశుగ్రాసం దగ్ధమైంది. రైతుకు రూ.20 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చెంచులకు ఉపాధ్యాయుడు చేయూత

ప్రజాశక్తి - కొత్తపల్లి

పాత మాడుగుల చెంచుగూడెంలో జీవిస్తున్న చెంచులకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు నూరుల్లా చేయూతనందించారు. ఆత్మకూరు మండలం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయుడు నూరుల్లా నందికుంట గ్రామ వాసి కావడంతో కొత్తపల్లి మండలంలో ఉన్న ఎదురు పాడు పాత మాడుగుల చెంచుగూడెంలలో ఉన్న 30 మంది చెంచులకు చీరలు ఇవ్వడంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. చెంచులకు సహాయం అందించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పలువురు అభినందనలు తెలియ జేశారు. పంపిణీ కార్యక్రమంలో ఐటీడీఏ సీసీలు యూసఫ్ స్వాములు ఉన్నారు.

వైఎస్ఆర్ బీమా సాయం పంపిణీ

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల గ్రామానికి చెందిన మడే పోగు జాన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం వైయస్సార్ బీమా పథకం కింద రూ 10 వేలు తక్షణ ఆర్థిక సహాయం సర్పంచ్ పెరుమాల శేషన్న, ఈఓఆర్డి పుల్లయ్య చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరుపేద కుటుంబం లోని యజమాని మృతి చెందుతే వైఎస్ఆర్ బీమా ఎంతగానో ఆదుకుంటు ందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు ఉపేంద్ర రెడ్డి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ఆలమూరు, గొనవరం గ్రామాల మధ్య పొలాల్లో రామతీర్థం గ్రామానికి చెందిన ప్రభాకర్ అచారి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఒలంపియాడ్‌లో గురు రాజా విద్యార్థినికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - నంద్యాల

హైదరాబాద్ నగరం నందు సుచిరిండియా ఫౌండేషన్ వారు రవీంద్ర భారతి ఆడిటోరియంలో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో సివి రామన్ యంగ్ జీనియస్ సైన్స్ ఒలంపియాడ్‌లో శ్రీ గురు రాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నాలుగో తరగతి విద్యార్థిని పి.సరయు గోల్డ్ మెడల్‌ను అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి సోమవారం తెలిపారు. సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ, ఫౌండేషన్ చైర్మన్ లయన్ డా.. కిరణ్ కుమార్, సినీ నటుడు అడవి శేషు చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌తో పాటు నగదు పారితోషకాన్ని, ప్రశంసా పత్రాన్ని విద్యార్థిని అందుకున్నట్లు చెప్పారు. గోల్డ్ మెడల్‌తో పాటు జిల్లాస్థాయిలో 11 మంది విద్యార్థులు డిస్టిక్ ఫస్ట్ ర్యాంక్‌లను సాధించి జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారని తెలిపారు. విద్యార్థులకు బాల్య దశ నుండి ఆధునిక టెక్నాలజీతో సైన్స్, మాథ్స్ సబ్జెక్టులలో బ్రెయిన్ బాక్స్ ఒలంపియాడ్, ఐఐటి ఫౌండేషన్ ద్వారా గురురాజా విద్యా విధానాలతో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో విద్యార్థులను జాతీయ, రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో విజేతలుగా తీర్చిదిద్దుతున్నామనడానికి మా విద్యార్థులు సాధించిన ఫలితాలే నిదర్శనమని కొనియాడారు.

సుప్రీం కోర్ట్ మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ చేతులమీదుగా చాత్రాలయ పురస్కారం అందుకున్న డైరెక్టర్ పి. షేక్షావలిరెడ్డి

సుచరిండియా ఫౌండేషన్ వారి సారథ్యంలో సి.వి రామన్ సైన్స్ ఒలంపియాడ్ అసోసియేషన్ వారు హైదరాబాద్ నగరం రవీంద్ర భారతిలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ పి .షేక్షావలి రెడ్డికి సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ సుచరిండియా ఫౌండేషన్ చైర్మన్ లయన్ కిరణ్ కుమార్, సినీ నటుడు అడవి శేషు చేతుల మీదుగా చాత్రాలయ పురస్కారాన్ని అందుకున్నారు. గత 22 సంవత్సరాలుగా విద్యారంగంలో విద్యార్థులను జాతీయ, రాష్ట్ర స్థాయిలో మాథ్స్, సైన్స్ రంగాలలో విజ్ఞులుగా తీర్చిదిద్దుతున్నందుకు, వారి విజ్ఞాన తృష్ణ నిదర్శనంగా చాత్రాలయ పురస్కారాన్ని అందజేసి వారి విజయాలను ప్రశంసించారు.

డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

అప్రెంటిస్ సమ్మిట్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-డోన్

ఐటిఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసుకున్న విద్యార్థులు డోన్‌లో నిర్వహిస్తున్న అప్రెంటిస్ సమ్మిట్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల నందు 100 కంపెనీలతో కలిసి రాయల సీమ జోన్ అప్రెంటిస్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిఐ, పాలిటెక్నిక్ చదువుకున్న విద్యార్థులు డోన్ పట్టణంలోని ఐటిఐ నందు 100 కంపెనీలు వచ్చాయని కంపెనీలలో ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు ఎనిమిది వేల రూపాయలు గౌరవ వేతనం అందిస్తారని, ట్రైనింగ్ పూర్తి చేసుకున్న తర్వాత వివిధ కంపెనీలలో పర్మినెంట్ ఉద్యోగులుగా తీసుకుంటారని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ అప్రెంటిస్ సమ్మిట్ మేళాలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, హిందూపురం, కడప జిల్లాల విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, రాయలసీమ ఐటిఐ కళాశాలల ప్రిన్సిపల్‌లు, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత కోచింగ్

- ఎంపీపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచర్ల

పూర్వ శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సి.హెచ్. చలం రెడ్డిలు తెలిపారు. మే 10 వ తేదీన జరగబోయే ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 19 నుండి మే 8వ తేదీ వరకు అనుభవగ్నులైన అధ్యాపకులచే భోదిస్తున్నట్లు తెలిపారు. మూడు కోర్సులతో పాటు అదనంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అనే అధునాతన, ప్రాయోజిత కోర్సును అందించబోతున్నామన్నారు. ప్రతి కోర్సును 60 సీట్లతో భర్తీ చేయబోతున్నామని, ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే విద్యార్థులకు కోర్సులు అందుబాటులోకి తేవడం మంత్రి బుగ్గన చొరవతోనే సాధ్యమని వారు అన్నారు. మండలంలోని విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే, టెక్నికల్ రంగంలో మంచి ఉపాధి అవకాశాల ను పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెర్సనల్ సెక్రెటరీ శ్రీనివాస రెడ్డి,వైసీపీ సీనియర్ నాయకుడు బాబుల్ రెడ్డి,కళాశాల ఓఎస్డి రాజేష్,మెకానికల్ సీనియర్ లెక్చరర్ శేఖర్, మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు, నాయకులు మురళీ కృష్ణ, నాగరాజు,తిరుమలేష్ రెడ్డి, ఎద్దులన్న, గోరుమాను కొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిజెపికి రాజకీయ సమాధి

5వపేజీ తరువాయి..

నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సామన్న, సిపిఐ మండల కార్యదర్శి ప్రతాప్, సిపిఎం మండల నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య బిజెపి అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. సిపిఎం నాయకులు హనుమంతు, ఏసేపు, బాల యేసు, ఎస్ఆర్ రమణ, మహిళా సంఘం నాయకురాలు రవణమ్మ, నాయకులు జయరాజు, రవి, మల్లయ్య పాల్గొన్నారు. **పగిడ్యాల:** బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపు దామని సిపిఐ మండల నాయకుడు అబ్దుల్ మజీద్ అన్నారు. మండలంలోని పాతకోట గ్రామంలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కలాం, రమణ, భీముడు, వెంకటేశ్వర్లు, రహిమాన్, గాంధీ తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను నిలదీయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు,సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ అన్నారు. చాగలమర్రి పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి యాత్ర నిర్వహించారు. యాత్ర స్థానిక అడ్డవాగు సెంటర్ నుండి మైన్‌బజార్, గాంధీ సెంటర్, పెద్దమకానం, ముత్యాలపాడు బస్టాండు వరకు సాగింది. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు,ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ, ఆళ్ళగడ్డ సిపిఐ కార్యదర్శి భాస్కర్,రుద్రవరం కార్యదర్శి బాలనరసింహులు, వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. **డోన్:** మండలంలోని పలు గ్రామాలలో 4వ రోజు సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల,పట్టణ కార్యదర్శిలు కే.నాగరాజు, నక్కిశ్రీకాంత్‌లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను దోచుకోవడం తప్ప ప్రజలకు ఎటువంటి మేలు చేయలేకపోయిందన్నారు. సిపిఎం పట్టణ మండల కమిటీ సభ్యులు చిన్నరహిమాన్,షమీం బేగం,నక్కి హరి, అశోక్,రత్న జయమ్మ, సుధాకర్, చరణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల మండలంలో..

చాగలమర్రి మండలంలో..

డోన్ మండలంలో..

మహారాజ శ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

OS 627/2022

G.ఓభయ్య. ...వాది

-Vs-

D. రవికుమార్ S/o జార్జ్
Govt Employee
H.No.23/1052-126 B, దేవనగర్,
నంద్యాల (టౌన్), నంద్యాల (జిల్లా). ...ప్రతివాది

దావా సమను

పై నెంబరు దావాలోని వాది ప్రతివాది అయిన మీపై ప్రాంసరీ బాకీ రాబట్టుటకు గాను దావా దాఖలు చేసివున్నారు. సదరు దావా 12/05/2023 వ తేదిన వున్నది. దావా నందు ప్రతివాది అయిన నీకు పై కోర్టువారు తేదిన ఉదయం 10.30 గం॥లకు హాజరు కావల్సినదిగా ఉత్తర్వులు ఇచ్చివున్నారు కనుక మీరు గానీ మీ తరపు వకీలు గారు గానీ హాజరై పై కోర్టు నందు ఆక్షేపణలు తెలియజేసుకొన వచ్చును. లేనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడను.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 12/05/2023

జి.శేషశయనరావు,
యం. శ్రీరాములు,
వాది పరం న్యాయవాదులు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440336016